క్లుప్తంగా

కామాక్షితాయి సేవలో..



ఆలయ సన్నిధిలో న్యాయమూర్తి కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారిని నెల్లూరు మొదటి అదనపు న్యాయమూర్తి జి.కపర్థి తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. తొలుత గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అర్చకులు స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండో ఎంఈఓగా హేమసుందరరావు



ముత్తుకూరు : మండల రెండో ఎంఈఓగా ఎస్.హేమసుందరరావు నియమితులయ్యారు. చేజర్ల మండలం, మాముడూరు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎంగా ఉన్న ఆయన ఆదివారం రెండో ఎంఈఓగా ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇప్పటికే ఎంఈఓగా మధుసూదన విధులు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట పంచాయతీ బురాన్‌పూర్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దామోదర్ నాయక్(45) అనే వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రంలోని గంజాం జిల్లా సామంతపల్లి గోపీనాథపూర్ గ్రామానికి చెందిన దామోదర్ నాయక్ గత రెండేళ్ల నుంచి మండలంలోని బురాన్‌పూర్‌లో అద్దె నివాసంలో ఉంటూ కూలి పనికి వెళ్లేవాడు. కొన్నిరోజులుగా మద్యానికి బానిసై అనారోగ్యంతో ఇంట్లోనే ఉండేవాడు. ఈ క్రమంలో ఈనెల 11న ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఈనెల 13న విశాఖపట్నానికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దామోదర్ నాయక్ కుమారుడు అనంతనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేయాలి

ఇందుకూరుపేట: మండలంలోని డేవిస్‌పేటలో దేవదాయశాఖ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపివేయాలని అఖిల భారత హిందూ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శ్రీలలితా మహేశ్వరి ఆశ్రమ పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి కోరారు. డేవిస్‌పేటలో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆయన ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు వచ్చి పరిశీలించి అన్య మతాలకు చెందిన నిర్మాణాలను నిలిపివేయాలన్నారు. ఈ నేపథ్యంలో నిర్మాణాన్ని రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ కె.రామకృష్ణారెడ్డి పరిశీలించారు. వివరాలు ఆరాతీశారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటాచలం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. గూడూరు పట్టణానికి చెందిన నవీన్ బైక్‌పై పని నిమిత్తం కృష్ణపట్నం పోర్టుకు వెళ్లాడు. తిరిగి గూడూరుకు వెళ్తుండగా సర్వేపల్లి సమీపంలో రహదారిపై గేదెలు అడ్డురావడంతో మోటారు బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో నవీన్‌కు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

నెల్లూరు రూరల్: మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రూరల్ పరిధిలోని కోడూరుపాడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. రూరల్ పోలీసుల వివరాల మేరకు.. స్థానికంగా ఉండే గున్నా నాగరాజు (35) కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఈయనకు భార్య దేవి, ఇద్దరు పిల్లలున్నారు. వ్యసనాలకు బానిసై కుటుంబంపై నిర్లక్ష్యంగా ఉండటంతో చెన్నైలోని తన పుట్టింటికి భార్య వెళ్లారు. కాపురానికి రావాలని పలుమార్లు ఆయన ప్రాధేయపడ్డారు. తాను రానని, పిల్లలను సైతం తన వద్దే చదివించుకుంటానని ఆమె చెప్పారు. దీంతో మనస్తాపానికి గురైన నాగరాజు తన ఇంట్లోని ఇనుప రాడ్డుకు చీరను బిగించుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఘటనపై పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న వారు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్ట్‌మార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు కొండంత ఆసరా



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు కె.వనజ. మండలంలోని పెనుబల్లి గ్రామంలో పార్వతి పొదుపు సంఘానికి చెందిన సభ్యురాలు. ఈ సంఘంలో ఏప్రిల్ 11, 2019 నాటికి ఈమెకు రుణం ఉంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన విధంగా ఆమెకు ప్రతి సంవత్సరం రూ.14,500 ఆసరా పథకం కింద తన బ్యాంకు ఖాతలో నగదు జమ అవుతోంది. ఇలా మూడు సంవత్సరాల పాటు ఆమెకు ఆసరా కింద నగదు అందింది. ఈ మొత్తంతో ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయాయని, ప్రస్తుతం సంతోషంగా ఉన్నట్లు ఆమె చెబుతున్నారు.



ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు పద్మకుమారి. పెనుబల్లి గ్రామానికి చెందిన ఈమెకు ఆసరా కింద ప్రతి సంవత్సరం రూ.17,600ల నగదు బ్యాంకులో జమ అవుతోంది. ఇప్పటివరకు మూడు దఫాలుగా రూ.52,800 వచ్చాయి. ఈ మొత్తంతో జీవనోపాధికి అవసరమైన మార్గాలను ఎంచుకున్నారు. చెప్పిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరా కింద రుణమాఫీ చేయడం చాలా సంతోషంగా ఉందని ఆమె అంటున్నారు.



ఈ మహిళ పేరు జ్యోతి కామేశ్వరమ్మ. మండలంలోని నాగాయగుంట గ్రామానికి చెందిన ఈమె భవాని పొదుపు సంఘంలో సభ్యురాలుగా ఉన్నారు. ఈమెకు ప్రతి సంవత్సరం ఆసరా కింద దాదాపు రూ.24,896 నగదు తన బ్యాంకు ఖాతాలో జమ అవుతోంది. అంటే మూడు సంవత్సరాల్లో దాదాపు రూ.74,688లు వచ్చాయి. మరో సంవత్సరం ఆసరా కింద మరో రూ.24,896 రానున్నాయి. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకోవడంతో మహిళల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని జ్యోతి తెలిపారు.

గత టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలను నిలువునా మోసం చేసింది. ఇచ్చిన హామీలను బుట్టదాఖలు చేసి ఎన్నికల ముందు పసుపు, కుంకుమ పేరుతో దగా చేసింది. దీంతో పీకల్లోతు కష్టాల్లో ఉన్న పొదుపు మహిళల దీనస్థితిని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో గుర్తించారు. వారిని ఆదుకునే విధంగా మేనిఫెస్టోలో పొందుపరిచినట్లు పొదుపు సంఘాల్లో ఉన్న మహిళలకు వరుసగా నాలుగు దఫాలుగా ఆసరా కింద బ్యాంకు రుణాలను మాఫీ చేస్తున్నారు.

- పొదుపు మహిళలకు ఇచ్చిన మాట నిలుపుకున్న సీఎం జగన్
- పసుపు, కుంకుమ పేరుతో మోసం చేసిన చంద్రబాబు

బుచ్చిరెడ్డిపాళెం: వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా పొదుపు మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలిచారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 2019 ఏప్రిల్ 11వ తేదీ వరకు పొదుపు సంఘాల్లో ఉన్న సభ్యులకు రుణాన్ని నాలుగు దఫాల్లో ఆసరా పథకం కింద రుణమాఫీ చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే మూడు దఫాలుగా ఆసరా కింద రుణమాఫీ చేసి పొదుపు సంఘాల మహిళలకు ఆర్థికంగా అండగా నిలుస్తున్నారు.

10,128 మందికి మేలు

బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని దాదాపు 1035 పొదుపు సంఘాల్లో 10,128 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులపాలు అయిన మహిళలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో న్యాయం జరిగింది.



ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి (ఫైల్)



దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట నిలుపుకున్నారని మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాఫీ పేరుతో దగా

గత టీడీపీ హయాంలో పొదుపు సంఘాల్లోని మహిళలను అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పసుపు, కుంకుమ పేరుతో మోసం చేశారు. పొదుపు సంఘాల ద్వారా తీసుకున్న రుణాలను మాఫీ చేయకుండా ఎన్నికలు దగ్గర పడటంతో ఓట్ల కోసం పసుపు, కుంకుమ పేరుతో ఒక్కో సభ్యురాలికి రూ.10 వేలను ఇచ్చి దగా చేశారు. ఈ పసుపు కుంకుమ కూడా కొందరికి మాత్రమే రావడంతో అనేక మంది అర్హులైన పొదుపు సంఘాల సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు.



తన దుకాణం వద్ద లీలమ్మ

జీవనోపాధికి బాటలు

పై ఫొటోలోని మహిళ పేరు జొన్న లీలమ్మ. ఈమెది దామరమడుగు గ్రామం. లక్ష్మి అనే పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. ప్రతి సంవత్సరం ఆమెకు ఆసరా కింద రూ.17,000 నగదును రాష్ట్ర ప్రభుత్వం తన బ్యాంకు ఖాతాలో జమ చేస్తోంది. ఈ నగదుతో పాటు తాను సొంతంగా కొంత నగదుతో ఇంటి వద్ద చిన్నపాటి దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం తన జీవనోపాధికి బాటలు వేసిందని ఆమె సంతోషంగా చెబుతున్నారు.

అర్హత కలిగిన సంఘాలను ఎంపిక చేశాం



మండలంలో 2019, ఏప్రిల్ 11వ తేదీ నాటికి బ్యాంకు రుణం ఉన్న దాదాపు 1,035 పొదుపు సంఘాలను ఎంపిక చేశాం. ఈ సంఘాల్లోని సభ్యులందరికీ ప్రతి సంవత్సరం దాదాపు రూ.9.17 కోట్ల వరకు ఆసరా నగదు కింద వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతోంది. ఇప్పటికే మూడు దఫాలుగా ఆసరా అందగా, మరో ఏడాది కూడా అందుతుంది.

– లలిత, ఏపీఎం

రామాలయంలో ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద జరుగుతున్న అన్నదానం

మనుబోలు : మండల కేంద్రంలోని కోదండరామపురం రామాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏటా ఆలయంలో జూన్ 17, 18వ తేదీల్లో ఏకాహం(24 గంటల పాటు భజన) నిర్వహిస్తారు. ఇందులో భాగంగా అర్చకుడు హరికృష్ణ మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. భక్తులు అఖండ దీపం వెలిగించి నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు.

రామమందిరం వీధిలో సీసీరోడ్ల నిర్మాణం



రామమందిరం వీధిలో నిర్మించిన సిమెంటురోడ్డు

పొదలకూరు : పట్టణంలోని రామమందిరం వీధిలో సిమెంటురోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పట్టణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' నిర్వహించిన సందర్భంగా ప్రధాన వీధుల నుంచి సందుల్లో సిమెంటురోడ్లు అవసరమని ఆయా ప్రాంతాల వారు కోరారు. వెంటనే స్పందించిన ఆయన నిధులు మంజూరు చేశారు. దీంతో ఎక్కడా మిగిలిపోకుండా సందుల్లో సీసీరోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేశారు. పద్మావతి నగర్, వినాయక మాన్యం వీధుల్లో సైడ్‌డ్రెయిన్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. ఇక్కడ సైడ్‌డ్రెయిన్లు లేవని స్థానిక ప్రజానీకం మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లడంతో వెంటనే స్పందించి మంజూరు చేయించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల వారు మంత్రి కాకాణికి కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తవంగల్లులో ఉచిత వైద్యశిబిరం



కొడవలూరు: మండలంలోని కొత్తవంగల్లు జెడ్పీ ఉన్నత పాఠశాలలో హేమలతారెడ్డి న్యూరో స్పెషాలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మెదడు, వెన్నెముక, నరాలకు సంబంధించి వైద్య నిపుణురాలు అంబటి హేమలతారెడ్డి పలువురికి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కొందరికి మెరుగైన వైద్యం అవసరమని నిర్ధారించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు మనోహర్‌బాబు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సత్తాచాటిన హిమతేజస్విని



బహుమతి అందుకుంటున్న హిమతేజస్విని

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చి నగర పంచాయతీకి చెందిన జి.హిమ తేజస్విని చదరంగం పోటీల్లో సత్తాచాటింది. ఈ సందర్భంగా ఆంధ్ర చెస్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ మస్తాన్‌బాబు ఆదివారం మాట్లాడుతూ ఈనెల 15వ తేదీ నుంచి విజయవాడలో జరుగుతున్న అండర్–19 ఏపీ స్టేట్ బాలికల చదరంగం పోటీల్లో హిమతేజస్విని ప్రతిభ కనపరిచి చాంపియన్‌గా నిలిచిందన్నారు. దీంతో త్వరలో గుజరాత్‌లో నిర్వహించే జాతీయ చదరంగం పోటీలకు ఆంధ్రప్రదేశ్ తరఫున ఆడుతుందన్నారు. ఈ సందర్భంగా హిమతేజస్వినిని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కేవీ శర్మ, కోశాధికారి జ్వాలాముఖి, ఆర్గనైజర్ రాజీవ్, కోచ్ ప్రదీప్ అభినందించారు.

విద్యాసామగ్రి అందజేత



బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఇస్కపాళెం మెయిన్ ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆదివారం విద్యా సామగ్రిని అందజేశారు. ఈ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తున్న పి.సరస్వతి బదిలీపై వెళ్తున్న సందర్భంగా విద్యార్థులకు పలకలు, నోటు పుస్తకాలను ఆమె అందించారు. వైఎస్సార్‌సీపీ నేత కోడూరు మధుసూదన్‌రెడ్డి, లాయర్ ఎం.రవి, ఉపాధ్యాయులు రమణయ్య, సురేంద్ర పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



పొలాల్లోకి దూసుకెళ్లిన కారు



రవికుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని ఆర్ఆర్‌నగర్ వద్ద ముంబై జాతీయ రహదారిపై ఆదివారం నెల్లూరు నుంచి బుచ్చిరెడ్డిపాళెం వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొంది. దీంతో ఆటో వెనుక వస్తున్న మరో రెండు బైక్‌లను కూడా ఢీకొని పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న పల్లాప్రోలు వడ్డిపాళేనికి చెందిన సీహెచ్ రవికుమార్(40) అక్కడికక్కడే మృతిచెందగా, ఆయన బైక్‌పై ఉన్న శైలు అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈమెను 108 అంబులెన్స్‌లో నెల్లూరులోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అలాగే మరో బైక్‌పై ఉన్న ఖాజామస్తాన్ అనే వ్యక్తికి కూడా గాయాలు కాగా బుచ్చిరెడ్డిపాళెంలోని సీహెచ్‌సీకి తరలించి చికిత్సను అందించారు.

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. కోవూరు మండల కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రసన్న ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడి సచివాలయ పరిధిలోనే రూ.15 కోట్ల సంక్షేమ ఫలాలు ప్రజలకు చేరిందన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ప్రజలు మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతు తెలపడం ఖాయమన్నారు. ఎవరెన్ని కుట్రలు పన్నినా ప్రజలు మాత్రం సంక్షేమ ప్రభుత్వం వైపే ఉన్నారన్నారు.

బడుగు వర్గాలకు ఉన్నత చదువులు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాలతో బడుగు, బలహీన వర్గాలకు ఉన్నత చదువులు చేరువ అయ్యాయని ఎమ్మెల్యే ప్రసన్న తెలిపారు. నిరుపేద కుటుంబాలకు చెందిన చిన్నారులు విద్యకు దూరం కాకుండా ఉండేందుకు అమ్మఒడి, విద్యాదీవెన, వసతిదీవెన, గోరుముద్ద, బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లు అందించడం వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు పద్మజ, ఎంపీడీఓ శ్రీహరి, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెరగని నిమ్మధరలు



మార్కెట్లో నిమ్మకాయలను గ్రేడింగ్ చేస్తున్న సిబ్బంది

- దసరా వరకు ఇదే పరిస్థితి

పొదలకూరు : నిమ్మమార్కెట్ రోజురోజుకు దిగజారిపోతోంది. ఈ ఏడాది రైతులు ఆశించినట్లుగా ధరలు లేకపోవడంతో డీలాపడ్డారు. విజయదశమి వరకు ధరలు పెరిగే అవకాశం ఉండదంటున్నారు. మధ్యలో పండగలు, తిరునాళ్ల సమయంలో స్వల్పంగా ధరలు పెరిగే అవకాశం ఉంది. గతేడాదితో పోల్చి చూస్తే ఈ ఏడాది ధరలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలిపారు. ప్రస్తుతం మార్కెట్లో ధరలు లూజు(బస్తా) రూ.1,600 నుంచి రూ.3 వేలు మాత్రమే ఉంది. కిలోల లెక్కన రూ.20 నుంచి రూ.35 వరకు ధర పలుకుతోంది. సాధారణంగా వేసవిలో ఎండలు తగ్గుముఖం పట్టకుంటే ధరలు కొంత నిలకడగా ఉండాలి. అయితే ఈ ఏడాది మే నెలలో కూడా ధరలు దిగజారుతూ వచ్చాయి. కాగా ఏప్రిల్ నుంచే ధరలు పెరగడం లేదు. ఈ ఏడాది టాప్ ధరలంటే రూ.6,500 మాత్రమే. గతేడాది టాప్ రూ.14 వేల వరకు పలికినట్లు రైతులు వెల్లడించారు. ఈ ఏడాది ఎండలు ఎంత ఎక్కువగా ఉన్నా ధరలు పెరగకపోవడం విడ్డూరం. తోటల నుంచి కాయల దిగుబడి విపరీతంగా పెరిగినట్లు వ్యాపారులు వెల్లడిస్తున్నా, ఆ స్థాయిలో ధరలు పతనం కావడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిమ్మతోటల రైతులు మార్చి, ఏప్రిల్, మే మాసాల్లోనే ఆర్థికంగా నిలదొక్కుకుంటారు. అయితే ఏడాది మూడు మాసాలు ఆశించిన స్థాయిలో ధరలు పెరగలేదు. ఇప్పుడున్న ధరల వల్ల రైతులకు నష్టం వాటిల్లకున్నా ఏడాది పొడవునా తోటల్లో చాకిరీ చేస్తూ మూడు మాసాలే ధరలు పెరుగుతాయని, ఆ మూడు మాసాల్లో ధరలు దిగజారితే ఆర్థిక ఇబ్బందులు ఎదర్కోవాల్సి వస్తుందని రైతులు వెల్లడించారు.

కోడూరు తీరంలో కోలాహలం



సందడి చేస్తున్న పర్యాటకులు

తోటపల్లిగూడూరు : ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మండల పరిధిలోని కోడూరు సాగర తీరం ఆదివారం పర్యాటకులతో కోలాహలంగా మారింది. ఎండల వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు జిల్లా నలువైపుల నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో కోడూరుకు పోటెత్తారు. దీంతో తీరం వెంబడి పిల్లలు, యువత కేరింతలు కొడుతూ సేదతీరారు. గంటల కొద్దీ సముద్ర స్నానాలతో గడిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సందర్శకుల రాకపోకలు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది.